

మండవల్లిలో కుండపోత వర్షం

ప్రజాశక్తి - మండవల్లి

మండలంలో కుండపోత వర్షం కురిసింది. బుధవారం రాత్రి జల్లులుగా ప్రారంభమైన వర్షం క్రమేపీ పెరిగి భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పామర్రు-దిగుమర్రు 165 జాతీయ రహదారిపై కైకలూరు రోడ్డులో ఏర్పడిన గోతుల్లోకి నీరు చేరుకుని గుంటలు కనపడకపోవడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడ్డారు. రైల్వేగేట్ వద్ద, శివాలయం వద్ద, ఎస్‌సివాడలో రోడ్లపైకి వర్షపు నీరు చేరుకుంది. బిసి బాలికల హాస్టల్‌కు వెళ్లే సిమెంట్ రోడ్డు, మంచాలు తయారు చేసేవారి సిమెంటు రోడ్లపైకి నీరు చేరింది.



జలమయమైన రహదారి

ధాన్యం డబ్బులివ్వండి.. మహాప్రభో..!



రెండు నెలలుగా అన్నదాతల ఎదురుచూపు

రెండు జిల్లాల్లో రూ.1,142 కోట్లు బకాయి

అప్పలకు వడ్డీ కట్టలేక, ఖరీఫ్ పనులకు సొమ్ములేక రైతులు లబోదిబో

వినతులిచ్చినా, ఆందోళనలు చేసినా పట్టించుకోని ప్రభుత్వం

దిక్కుతోచని స్థితిలో ధాన్యం రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం సొమ్ము అందక అన్నదాత పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. పండిన పంటను విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా సొమ్ము జమ చేయకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రబీలో తెచ్చిన అప్పులు తీర్చలేక, ఖరీఫ్ సాగుకు పెట్టుబడులు పుట్టక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రులు, ఎంఎల్‌ఎలు, అధికారులకు ఎన్ని వినతులిచ్చినా ప్రయోజనం లేకపోవడం మట్టి మనిషిని తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. గడిచిన రబీలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. రబీలో పశ్చిమగోదావరి జిల్లాలో 7.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అధికారులు ప్రణాళికలు రచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 6.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఏప్రిల్ 28వ తేదీకి ముందు రూ.400 కోట్లు వరకూ చెల్లింపులు చేశారు. ఆ తర్వాత ధాన్యం సొమ్ము జమ నిలిచిపోయింది. దీంతో ఇంకా రైతులకు అందాల్సిన రూ.900 కోట్లు బకాయి అలాగే ఉండిపోయింది. ఏలూరు జిల్లాలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించగా రెండు లక్షల 161 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మొత్తం రూ.439.01 కోట్లు విలువ చేసే ధాన్యం కొనుగోలు చేయగా ఇప్పటి వరకూ చెల్లించిన సొమ్ము కేవలం రూ.196.09 కోట్లు మాత్రమే. ఇంకా రూ.242 కోట్లు ధాన్యం సొమ్ము బకాయి ఉండిపోయింది. కొనుగోలు చేసిన ధాన్యంలో 40 శాతం సొమ్ము మాత్రమే చెల్లించారు. ధాన్యం విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సొమ్ము అందకపోవడంతో రైతులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. పౌర సరఫరాలశాఖ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఈ వారంలో, పది రోజుల్లో అంటూ అధికారులు మాటలు చెప్పడం మినహా డబ్బు మాత్రం జమ కావడం లేదు. రైతుసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వానికి పట్టని పరిస్థితి. రబీలో తెచ్చిన పెట్టుబడులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. కోత యంత్రాలకు, దుక్కు దున్నిన ట్రాక్టర్లకు, కూలీలకు సొమ్ము చెల్లించకపోవడంతో రైతులపై ఒత్తిడి పెరుగుతోంది. ఖరీఫ్ సాగు మొదలైంది. పిల్లలకు బడులు ప్రారంభమయ్యాయి. పెట్టుబడులకు, పిల్లల ఫీజులు, పుస్తకాల కొనుగోలుకు సైతం రైతుల చేతుల్లో చిల్లిగవ్వ లేక నానావస్థలు పడుతున్నారు. అసలు ఎప్పటికిస్తారో కూడా సమాధానం చెప్పని పరిస్థితి నెలకొంది. కొత్త ప్రభుత్వం తొలుత రైతుల ధాన్యం డబ్బు జమ చేయాలని అన్నదాత కోరుతున్నాడు. ప్రభుత్వాలు మారినా రైతుల బతుకుల్లో మార్పులు రావడం లేదనే ఆవేదన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. ధాన్యం సొమ్ము జమపై ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణిని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



రూ.ఆరు లక్షలు ధాన్యం సొమ్ము జమకాక తీవ్ర ఇబ్బందులు

బైరెడ్డి లక్ష్మణరావు, కౌలురైతు, సుంకరవారితోట

రబీలో సాగు చేసిన పదెకరాల ధాన్యం మే మూడు, నాలుగు తేదీల్లో విక్రయించాను. రూ.ఆరు లక్షల సొమ్ము వరకూ రావాలి. దాదాపు రెండు నెలలు కావొస్తున్నా సొమ్ము జమ కాలేదు. అధికారుల వద్దకు వెళ్తే అదిగో.. ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తున్నారు. రబీలో పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చలేదు. ఖరీఫ్ సాగుకు ఎవరూ అప్పు ఇవ్వడం లేదు. దీంతో నరకయాతన అనుభవిస్తున్నాం. కొత్త ప్రభుత్వం పట్టించుకుని ధాన్యం సొమ్ము జమ చేయాలని కోరుతున్నాం.

అప్పల వాళ్ల ఒత్తిడి తట్టుకోలేకపోతున్నాం


పోతురాజు, కౌలురైతు, ఏలూరు రూరల్



రబీలో ఎనిమిదెకరాలు సాగు చేశాను. 480 సారల ధాన్యం మే మొదటి వారంలో విక్రయించాను. ఇప్పటి వరకూ సొమ్ము జమ కాలేదు. పెట్టుబడుల కోసం అప్పు తెచ్చిన చోట ఒత్తిడి పెరుగుతోంది. ధాన్యం సొమ్ము అందలేదని చెప్పినా నమ్మడం లేదు. ఇప్పటికైనా ధాన్యం సొమ్ము వెంటనే జమచేయాలని కోరుతున్నాం.

ధాన్యం సొమ్ము వెంటనే చెల్లించాలి

కె.శ్రీనివాస్, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి



ధాన్యం సొమ్ము చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే రూ.200 కోట్లకుపైగా రైతులకు అందాల్సి ఉంది. సొమ్ము అందక ఖరీఫ్ సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే ధాన్యం సొమ్ము ఇవ్వకపోతే రైతులతో కలిసి ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తాం.

1న ఇంటి వద్దే పెన్షన్ల పంపిణీ

ఎరియర్స్‌తో కలిపి రూ.7 వేలు అందజేత

జిల్లాలో 2.68 లక్షల మందికి రూ.183 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

పెంచిన పెన్షన్ మొత్తం జులై ఒకటో తేదీన పంపిణీకి అన్ని ఏర్పాట్లూ చేసినట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లాలో వివిధ రకాల పెన్షన్లు పొందుతున్న రెండు లక్షల 68,904 మందికి జులై 1న రూ.183 కోట్లు పంపిణీ చేస్తారన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి జిల్లాలోని ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ పెన్షన్ల పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జులై 1న పెన్షన్‌దారుల ఇంటింటికీ వెళ్లి సచివాలయ ఉద్యోగులు పెన్షన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. ఒక్కో పెన్షన్‌దారునికి రూ.ఏడు వేలు అందించాలన్నారు. ఒక్కో సచివాలయ ఉద్యోగికి 50 ఇళ్లు కేటాయించామని, 50 ఇళ్లకంటే ఎక్కువ ఉంటే వేరే శాఖల ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే పంపిణీకి సిద్ధం చేయాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోను ఆశా వర్కర్లను పంపిణీకి వినియోగించరాదని స్పష్టం చేశారు. ఈ నెల 29న శనివారం నాడే బ్యాంకు నుండి బందోబస్తుతో పెన్షన్ల సొమ్మును డ్రా చేసుకొని జాగ్రత్త పరచాలన్నారు. 28వ తేదీ ఉదయానికల్లా పెన్షన్ల మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. పంపిణీ బయోమెట్రిక్‌తోనే నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెన్షన్ల పంపిణీపై ఎటువంటి ఫిర్యాదులు అందినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించిన సమాచారం అందించడానికి జిల్లా, మండలస్థాయిలో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభం కావాలని, మొదటిరోజే 95 శాతం పంపిణీ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పింఛను సొమ్ము స్వీకరించిన వారి వద్ద నుండి వచ్చిన రశీదును ఉన్నతాధికారులకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, ఎల్‌డిఎం నీలాద్రి, జెడ్‌పి సిఇఒ కెఎస్‌ఎస్.సుబ్బారావు, డిపిఒ శ్రీనివాస్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

అతిసారను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు

జిల్లాలో డయేరియా (అతిసార) వ్యాప్తిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఆమె వీడియోకాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డయేరియా కేసులు కొన్ని మండలాల్లో నమోదవుతున్నాయని, వీటి నివారణకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే పటిష్టమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. జులై 1 నుంచి ఆగస్టు చివరి వరకు డయేరియా నిర్మూలనపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. దీనికి జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు చేపట్టారని తెలిపారు. అన్ని తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఆర్‌ఒ ప్లాంట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ క్లోరినేషన్ నిర్వహించాలన్నారు. డయేరియా విషయంలో వైద్య ఆరోగ్య శాఖ పూర్తి అప్రమత్తంగా ఉండి ఎక్కడైనా కేసులు నమోదైతే వెంటనే స్పందించి వైద్యసేవలు అందించాలన్నారు.

ధాన్యం సొమ్ము కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

దాళ్వా ధాన్యం బకాయి సొమ్ము చెల్లించాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో కైకరం పంచాయతీ కార్యాలయ సమీపంలో అన్నదాతలు ఆందోళన నిర్వహించారు. ధాన్యం సొమ్ము చెల్లించండి మహాప్రభో అంటూ రోడ్డెక్కి నినదించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు మాట్లాడారు. జిల్లాలోని రైతులు, కౌలురైతులకు రూ.240 కోట్లు వరకు ధాన్యం బకాయిలు చెల్లించకపోవడంతో సార్వా పెట్టుబడుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాత అప్పులు తీరక, ఖరీఫ్ సాగుకు కొత్త అప్పులు దొరకక దిక్కుతోచక అల్లాడుతున్నారని చెప్పారు. కొత్త ప్రభుత్వం ధాన్యం బకాయిల చెల్లింపునకు చర్యలు చేపట్టి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.కేశవ, ఇందుకూరి వెంకట్రాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.



రోడ్డెక్కి నినాదాలు చేస్తున్న అన్నదాతలు, రైతు సంఘం నేతలు

చింతలపూడి: పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పుల్లారు సోమశేఖర్, దొంత కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేశారు. ధర్నాలో నేతలు ఎస్‌కె.ఖాలేషా, కంచర్ల గురవయ్య, బాబు, ఎస్‌కె.జానీ, తక్కిలపాటి ప్రసాద్, తాడిగడప మాణిక్యాలరావు పాల్గొన్నారు.

కాటేసిన కరెంటు..!

వేర్వేరుచోట్ల విద్యుదాఘాతానికి తల్లీకొడుకు, భార్యాభర్తలు దుర్మరణం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి, తాడేపల్లిగూడెం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో గురువారం విద్యుత్ తీగలు యమపాశాలుగా మారాయి. వేర్వేరుచోట్ల విద్యుద్ఘాతానికి గురై నలుగురు మృతి చెందడం అందరినీ కలిచివేసింది. ఏలూరు జిల్లాలో తల్లీ కొడుకు మృతి చెందగా, పశ్చిమగోదావరి జిల్లాలో దంపతులు దుర్మరణం పాలయ్యారు.దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలోని ఈదర రావిచెట్టు సెంటర్ వద్ద దళితవాడలో దొండపాటి నాగరత్నం (62) తన ఇద్దరు కుమారుల వద్ద ఉంటోంది. గురువారం కూలి పనికి వెళ్లొచ్చిన నాగరత్నం అప్పటికే వర్షం పడి ఆగడంతో బయట తీగపై బట్టలు ఆరవేస్తోంది. ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో నాగరత్నం విద్యుద్ఘాతానికి గురైంది. ఆమె పెద్దగా కేకలు వేయడంతో గమనించిన ఆమె పెద్ద కుమారుడు దొండపాటి రామదాసు (44) పక్షవాత బాధితుడైనప్పటికీ తల్లిని కాపాడాలనే తపనలో ఆమెను పట్టుకుని లాగే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో రామదాసు కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో తల్లీ కొడుకు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మృతుడు దొండపాటి రామదాసుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామదాసు భార్య దొండపాటి సుభాషిణి ఫిర్యాదు మేరకు ఆగిరిపల్లి ఎస్ఐ బి.సురేంద్రకుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దంపతులు దుర్మరణం

విద్యుదాఘాతానికి భార్యాభర్తలు దుర్మరణం పాలైన ఘటన గురువారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని ఆరోవార్డులో గాంధీబొమ్మ సెంటర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గట్టెం అన్నపూర్ణ (55), భర్త గట్టెం వెంకన్న (60) ప్రతిరోజూ ఉదయం పూట టిఫిన్ వ్యాపారం చేస్తున్నారు. దీనికోసం గురువారం సాయంత్రం అన్నపూర్ణ ఇడ్లీ పిండి ఆడేందుకు మోటార్ స్విచ్‌ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన భర్త వెంకన్న సైతం విద్యుదాఘాతానికి గురై ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. వీరికి వివాహితులైన ఒక కొడుకు, ఒక కుమార్తె ఉన్నారని, వారు వేరేచోట ఉంటున్నారని స్థానికులు తెలిపారు. పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ఎంఎల్ఎ బొలిశెట్టి దిగ్భ్రాంతి

విద్యుదాఘాతానికి దంపతుల మృతిపై ఎంఎల్ఎ బొలిశెట్టి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలిని ఆయన పరిశీలించి కారణాలు పోలీసులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబీకులకు రూ.పది వేలు ఆర్థిక సాయం ఎంఎల్ఎ అందజేశారు. బాధిత కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

దోసపాడు పేదలకు జెసి కోర్టు తీర్పును అమలు చేయాలి

అధికారుల నిర్లక్ష్యంపై వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆగ్రహం

ప్రజాశక్తి - దెందులూరు

దోసపాడు పేదలకు జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడు దళితులు, పేదలు కొంతకాలంగా అసైన్డ్, సీలింగ్, గయ్యాళ భూములను పేదలకు పంచాలని, పట్టాలు, పాస్‌బుక్‌లు ఇవ్వాలని కోరుతూ ఆందోళన, పోరాటాలు నిర్వహించినా రెవెన్యూ అధికారులకు కళ్లకు కనపడలేదా అని విమర్శించారు. స్వయంగా జాయింట్ కలెక్టర్ కోర్టు అసలైన అసైన్డ్‌దారులకు పట్టాలు, పాసుబుక్‌లు ఇవ్వాలని ఆదేశాలిచ్చినా వాటి అమలులో మండల రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలు కొన్ని సంవత్సరాల నుండి వాళ్ల తాతలు, తండ్రులు చనిపోయిన వారికి మరణ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సంబంధిత (ఫ్యామిలీ సర్టిఫికెట్లు) పత్రాలు ఇవ్వాలని విన్నవించుకున్నా నేటికీ పూర్తిస్థాయిలో ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దోసపాడు దళితుల పట్ల మండల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోందన్నారు. గ్రామ పంచాయతీ అధికారుల తీరును విమర్శించారు. పంచాయతీలో చనిపోయిన వ్యక్తులకు డెత్ సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన బాధ్యత మరిచి భూస్వాముల లంచాలకు అలవాటుపడి పేదలకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. దోసపాడు పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, విఆర్‌ఒలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధులను విస్మరించి ప్రభుత్వ ఆస్తులను భూస్వాములకు కట్టబెట్టేలా వ్యవహరించే వారిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో పేదలకు అన్యాయం జరిగిందని మండిపడ్డారు. సకాలంలో ఇవ్వాల్సిన సర్టిఫికెట్లను ఇవ్వకపోవడంతో దోసపాడు దళితులకు అన్యాయం జరిగిందన్నారు. అధికారుల నిర్లక్ష్యానికి పేదలు, దళితులు బలి పశువులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే దోసపాడు దళితులకు, పేదలకు ఫ్యామిలీ సర్టిఫికెట్లు వారి వారసులకు ఇవ్వాలని కోరారు. చనిపోయిన వారికి డెత్ సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పంతగాని అనంతరావు, చల్లా లాజరు మణి, చమలమూడి జాన్‌రాజు, డి.నాగేంద్ర, భూపోరాట నాయకులు డి.మాణిక్యం, దాసరి దీవెనమ్మ, తేరేజమ్మ, లక్ష్మి, సిహెచ్.లక్ష్మి నాయకత్వం వహించారు.



వినతిపత్రం అందిస్తున్న వ్యకాస జిల్లా కార్యదర్శి రామకృష్ణ



వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న డిఇఒ అబ్రహం

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

పాఠశాలలో డిఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వర్షాకాలంలో డయేరియా ప్రబలే అవకాశం ఎక్కువగా ఉండడంతో పాఠశాల పరిసర ప్రాంతాలు, విద్యార్థులు తాగే నీటి ట్యాంకులను శుభ్రపరచాలని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం సూచించారు. ఏలూరు నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానోపాధ్యాయులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరో తరగతిలో నూతనంగా చేరిన వారి సంఖ్య, విద్యార్థుల హాజరు శాతం ఎలా ఉందనే అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నీటిని సరఫరా చేసే ట్యాంకులను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని చెప్పారు. వర్షాకాలంలో డయేరియా ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రత కూడా ముఖ్యమని విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు.

ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

పలు శాఖల అధికారులతో డిఆర్ఒ పుష్పమణి సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో వరదలు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సంసిద్ధతపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో గ్రామ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి డి.పుష్పమణి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సంసిద్ధతపై ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒలు ఎన్‌ఎస్‌కె.ఖాజావలీ, కె.అద్దయ్య, వై.భవానీశంకరి, వివిధ శాఖల అధికారులతో ఆమె గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ పుష్పమణి మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో వరదలు, తుఫాన్లు వంటి సమయాల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై సంబంధిత శాఖల అధికారులందరూ సవివరమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి సమర్పించాలన్నారు. జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, తదితర మండలాల్లోని గోదావరి పరివాహక గ్రామాలు వరదలు, తుఫాన్ల కారణంగా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, ఆయా ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందుగా వరదలు సంభవించే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు, భోజన, వసతి సదుపాయాలు, తాగునీరు, పారిశుధ్యం, వైద్య కేంద్రాలు, తదితర ఏర్పాట్లకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉన్న గ్రామాల ప్రజలకు పంపిణీకి గాను ముందుగానే నిత్యావసర సరుకులను ఆయా మండల కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో నది గట్లు పటిష్టతను పరిశీలించి, బలహీనమైన గట్లను వెంటనే పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. లైఫ్ జాకెట్లు, లైఫ్ బోట్లు , గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుకోవాలని మత్స్య శాఖాధికారులను ఆదేశించారు. వరదలు, తుపాన్ల హెచ్చరికలు జారీ అయిన వెంటనే ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వరదలు, తుపాన్ల కారణంగా కాలువలు, వాగులు పొంగే అవకాశం ఉన్నందున కాజ్ వే వంటి వాటి వద్ద వరద నీరు ఉధృతి ఉన్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఉంచాలని, ప్రజలు ఎవరినీ అనుమతించకుండా అక్కడ సిబ్బందిని నియమించాలన్నారు. వరదలు, తుపాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో గత రెండేళ్లుగా పటిష్టమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్న కారణంగా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టాలు జరగలేదన్నారు. అదే స్ఫూర్తితో అధికారులు సిబ్బంది పని చేయాలని డిఆర్ఒ సూచించారు. వరదలు, తుపాన్ల హెచ్చరికలు జారీ అయిన వెంటనే పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులను అప్రమత్తం చేయాలని, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సిఇఒ కె.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శర్మిష్ఠ, ఆర్‌డబ్ల్యుఎస్, రోడ్లు భవనాల శాఖ సూపెరింటెండింగ్ ఇంజినీర్లు సత్యనారాయణ, జాన్ మోషే, పశుసంవర్ధక శాఖ జెడి నెహ్రూబాబు, వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలకు 53 వేల దరఖాస్తులు

నూజివీడు టౌన్ : ట్రిపుల్ ఐటీల్లో 2024-25 అడ్మిషన్లకు సంబంధించి 53,863 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. జులై 11న ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. వీరికి జులై 22, 23 తేదీల్లో నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీల్లో, 24, 25 తేదీల్లో ఒంగోలు, 26, 27 తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో సర్టిఫికెట్ల పరిశీలన చేసి అడ్మిషన్లు ఇస్తారు. స్పెషల్ కేటగిరీ వారికి జులై ఒకటో తేదీ నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేస్తారు.

ప్రశాంతంగా డిఇఎల్ఇడి పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డి ఇ ఎల్ ఇ డి నాలుగో సెమిస్టర్ పరీక్షలు నాలుగోరోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం పరీక్షా కేంద్రాలను సందర్శించారు. గురువారం జరిగిన పరీక్షలో 60 మంది విద్యార్థులకు 60 మంది హాజరయ్యారని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక వెంకటాపురం పంచాయతీ ఐదో డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, లంచ్ బాక్స్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభ సమయంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, లంచ్ బాక్స్‌లు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి ఎంతో ఉత్సాహంతో పనిచేస్తున్నారన్నారు. ఇదే ఉత్సాహాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి అనేక రకాల సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. స్కూల్‌లో ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన క్లస్టర్ ఇన్‌ఛార్జి రెడ్డి గౌరీ శంకర్, జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు, జన సైనికులు పాల్గొన్నారు.

చింతలపూడి : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయులకు యాప్స్ ద్వారా కలిగే ఇబ్బందులను తొలగించాలని, పని భారం తగ్గించాలని ఆదేశాలు ఇవ్వడంతో ఉద్యోగుల నుంచి మంచి స్పందన వచ్చిందని టిడిపి చింతలపూడి నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం అన్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో ఉన్న పాఠశాలలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్, చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ ఆదేశాల మేరకు టిడిపి గ్రామ నాయకులు రాజు, జనసేన నాయకులు ప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల అధ్యక్షతన విద్యార్థులకు గురువారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, సీనియర్ నాయకులు తాటి అప్పారావు, మాజీ సర్పంచి చిట్లూరి ధర్మరాజు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు నలమాటి రామకృష్ణ, బిజెపి జిల్లా మహిళా మోర్చా నాయకురాలు కొత్తపల్లి విజయ, జనసేన నాయకులు ఆర్నేపల్లి అప్పారావు, ఎస్‌సి సెల్ టౌన్ అధ్యక్షులు కర్లపూడి రాజారత్నం, తెలుగు యువత టౌన్ అధ్యక్షులు నత్త రవి పాల్గొన్నారు.

టి.నరసాపురం : ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ జయ్యవరపు శ్రీరామమూర్తి తెలిపారు. మండలంలోని కేతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గురువారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసించాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్వేచ్ఛతో కూడిన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి మండలాధ్యక్షులు అడపా నాగరాజు, నాయుడు రామకృష్ణారావు గౌడ్, కేతవరం ఉప సర్పంచి భీమవరపు జగన్మోహన్‌రావు, మాజీ సర్పంచి వెలిది నాగబాబు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు జయ్యవరపు శ్రీనివాసరావు, జయ్యవరపు వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు టి.మల్లయ్య, ఉపాధ్యాయులు గ్రేస్ మార్త, సునీత, బి.వీరనాగమణి పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని వేల్పుచర్ల పడమర వైపు పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిసి బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందించినట్లు టిడిపి నాయకులు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం

భీమడోలు : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం, ఈ మేరకు పలు ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయటం అభినందనీయమని సామాజిక కార్యకర్త మండే సుధాకర్ అన్నారు. భీమడోలు మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయులు పల్లా ఆదినారాయణ సంస్మరణార్థం ఆయన కుమారులు రాజమండ్రిలో న్యాయవాదిగా పని చేస్తున్న త్రినాధరావు రూ.15 వేల విలువైన పాఠ్య పుస్తకాలు, వస్తువులను జెఎంఎం.పురం ఎంపిపి ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు గురువారం సాయంత్రం అందించారు.

పింఛన్ల పంపిణీకి ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీకి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్‌కు తెలిపారు. ఎపి సచివాలయం నుంచి ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు పాల్గొన్నారు. జిల్లాలో పెన్షన్ల పంపిణీ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తొలుత సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ, వార్డ్ సచివాలయ ఉద్యోగులు పెన్షన్ దార్ల ఇళ్లకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షన్ల పంపిణీకి ఒకొక్క ఉద్యోగికి 50 ఇళ్ల కేటాయించాలన్నారు. అదనంగా అవసరమైతే ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే వినియోగించాలన్నారు. పెన్షన్‌దార్లకు మొత్తం రూ.ఏడు వేలు ఈ నెలలో చెల్లింపునకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ కె.సుబ్బారావు, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ నీలాద్రి పాల్గొన్నారు.

గిరిజనుల పేర్లు అడంగల్‌లోకి ఎక్కించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ

ప్రజాశక్తి - పోలవరం

ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్ట ప్రకారం సాగులో ఉన్న భూములకు గిరిజనుల పేరుతో సాగు అడంగల్‌లో ఎక్కించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సిపిఎం భూ పోరాట వాటాదారుల సమావేశం సముద్రాల సాయికృష్ణ అధ్యక్షతన మండలంలోని వింజరం గ్రామంలో గురువారం నిర్వహించినట్లు మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రామకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు భూస్వాములకు కొమ్ముకాస్తూ గిరిజనుల పేర్లు అడంగల్‌లో ఎక్కించడం లేదన్నారు. తక్షణం ఏజెన్సీ పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో సాగులో ఉన్న గిరిజనుల పేర్లు అడంగల్‌లోకి ఎక్కించి తగు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొవ్వాస్సు గంగ, వి.సుబ్బాయమ్మ, ఆకుల దుర్గ, రామలక్ష్మి పాల్గొన్నారు.

పిహెచ్‌సి సిబ్బంది అందుబాటులో ఉండాలి

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బంది పని తీరు గురించి ఆరా తీశారు. ఆయనతో పాటు నాయకులు మూర్తి, కేశవ, ఎఎన్‌ఎం కుమారి ఉన్నారు.

అందరికీ అండగా ఉంటా

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

గత ఐదేళ్ల పాటు జరిగిన వైసిపి అరాచక పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని, అర్హత ఉండి కూడా వైసిపి నాయకుల అవినీతి వల్ల ప్రభుత్వ పింఛన్లు అందుకోలేకపోయిన ప్రతిఒక్కరికీ సామాజిక పింఛన్లు అందించి న్యాయం చేస్తామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఆయనను గురువారం ఉదయం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, పలు సంస్థల ప్రతినిధులు, ప్రజలు, అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పండ్ల మొక్కలను అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల కష్టాలను, సమస్యలను సవినయంగా ఆలకించిన చింతమనేని ప్రభాకర్, సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతుల సమస్యలు పరిష్కరించాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపులో భాగంగా రైతాంగ సమస్యలపై గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించారు. రైతు సమస్యలు పరిష్కరించాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిందని, ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రైతుకు రూ. 20 వేలు ఈ ఖరీఫ్ సీజన్ లోనే అందించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. శివారు భూములకు నీరందించేందుకు కాలువల్లో పూడికలు తీయాలని కోరారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ నూతన ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, కార్యవర్గ సభ్యులు మావూరి విజయ, బళ్ల కనకదుర్గారావు, పోటేలు పెంటయ్య పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కోళ్ల వ్యర్థాల వ్యాన్ పట్టివేత

తెలంగాణ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - ఉంగుటూరు

తెలంగాణా నుంచి మద్యం సీసాలు, కోడి వ్యర్థాలతో వస్తున్న వ్యాను నారాయణపురం వద్ద ఒక వ్యక్తిని ఢీకొట్టింది. నిబంధనలకు విరుద్ధంగా పర్యావరణానికి హాని కలిగే కోడి వ్యర్థాలను పట్టపగలే తరలిస్తున్న వ్యాను ప్రమాదానికి గురవటంతో అక్రమ రవాణా బయటపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమర్రు మండల తోకలపల్లికి చెందిన కోడి వ్యర్థాలు రవాణా చేసే వ్యాను హైదరాబాదులో బుధవారం రాత్రి బయలుదేరింది. గురువారం ఉదయం నారాయణపురం లయన్స్ క్లబ్ ఎదురుగా పొలం నుంచి వస్తున్న రైతును వ్యాను ఢీకొట్టింది. స్థానికులు అప్రమత్తమై వ్యాన్ ఆపగా డ్రైవర్ మద్యం తాగి ఉన్నాడని గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆ వ్యానులో పలు మద్యం సీసాలు, సుమారు నాలుగు టన్నుల కోడి వ్యర్థాలు ఉన్నట్లు గుర్తించారు. వ్యానును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

ఘనంగా బంకించంద్ర ఛటర్జీ జయంతి

ప్రజాశక్తి - ముసునూరు

అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని రాధికా రాణి బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంకిం చంద్ర ఛటర్జీ 1838 జూన్ 27న పశ్చిమ బెంగాల్‌లో జన్మించారని చెప్పారు. ఆనంద్ మఠ్ అనే నవల నుంచి వందేమాతరం గేయాన్ని సంగ్రహించారని తెలిపారు. ఈ గీతం భారత స్వతంత్ర్య సంగ్రాహంలో సమర శంఖంగా పని చేసిందన్నారు. బంకిం చంద్రం ఛటర్జీ బెంగాలీ, ఆంగ్ల భాషలను మాట్లాడేవారని తెలిపారు. యూనివర్శిటీ ఆఫ్ కలకత్తాలో విద్యను అభ్యసించేవారన్నారు. 1950 జనవరి 24వ తేదీన దేశభక్తి గీతంగా భారత ప్రభుత్వం దత్తత తీసుకుందన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి జయశ్రీ, ద్వితీయ బహుమతి దేవత్రినాథ్, తృతీయ బహుమతి మణికంఠ సాధించారు. వక్తృత్వ పోటీల్లో ప్రథమ బహుమతి గీతిక, ద్వితీయ బహుమతి నాగాంజలి సాధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, సాకా రవి, బాలు, రంగారావు, విఠల్ బాబు, మోహన్‌రావు, పుల్లారావు, మల్లేశ్వరి, కృష్ణవేణి, మనోహరం, కోటేశ్వరమ్మ, సౌజన్య నాన్ టీచింగ్ సిబ్బంది రవి, నారాయణ, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ లక్ష్మి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వృత్తి పట్ల అంకితభావంతో పని చేసిన వారికి సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఆగిరిపల్లి ఎంఇఒలు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని శోభనాపురం ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు ఎం.పాపారావు ఈ నెలాఖరికు ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా గ్రామస్తులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఆయనను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాపారావు చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు జివి.కృష్ణారావు, ఐబి.రవికుమార్, మూర్తి, రాజు, జనార్ధనరావు, ఆర్.వెంకటేశ్వరరావు, అజరయ్య, చక్రధరరావు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంపిడిఒ కె.జోగేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో గురువారం మండల విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో విద్యాప్రవేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నుంచి 14 ఏళ్ల మధ్య పిల్లలందరూ పాఠశాలల్లో ఉండేలా ప్రధానోపాధ్యాయులందరూ ఆయా పాఠశాలల పరిధిలో సర్వే చేసి విద్యాప్రవేశ్ 90 రోజుల కార్యక్రమం అమలు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి, మండల విస్తరణాధికారి రామ్‌ప్రసాద్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ లక్ష్మి పాల్గొన్నారు.

సప్లమెంటరీ పరీక్షలో 127 మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇటీవల జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలకు మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి 131 మంది విద్యార్థులు హాజరవ్వగా 127 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ-2 ఎస్.బుచ్చియ్య గురువారం తెలిపారు. బర్రింకలపాడు గిరిజన గురుకుల పాఠశాల నుంచి 26 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 26 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ బి.పెద్దిరాజు తెలిపారు. జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 28 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 27 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయురాలు టి.చంద్రావతి తెలిపారు. ప్రయివేట్ విద్యార్థులు 86 మంది పరీక్షలు రాయగా 46 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ తెలిపారు.

రేపు హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో హుండీని ఈ నెల 29వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఎసి నేల సంధ్య గురువారం తెలిపారు. దేవాదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో స్వామి వారి హుండీ లెక్కించనున్నట్లు ఆమె తెలిపారు.

విద్యార్థులకు నాణమైన ఆహారం, విద్య అందించాలి



ప్రిన్సిపల్, వార్డెన్‌లతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థుల నుంచి, వారి తల్లిదండ్రుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదని ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి అంబేద్కర్ గురుకుల పాఠశాల, ఎస్‌సి హాస్టల్స్ ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్‌తో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాలు ఇతర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్‌లు డ్యూటీ టైంలో కచ్చితంగా విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే డైలీ మెనూ, శానిటేషన్, తాగునీటి సదుపాయాలపై ఎలాంటి లోపాలున్నా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

అమరజీవుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

అమరజీవుల వర్ధంతి సభలో సిపిఎం నగర కార్యదర్శి కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు

కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేస్తూ అమరులైన వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడేమ వారికిచ్చే ఘన నివాళి అని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అన్నారు. స్థానిక చేపల తూము సెంటర్, మున్సిపల్ మార్కెట్ వద్ద సిపిఎం అమరజీవుల వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ సిపిఎం ఏలూరు పట్టణ కార్యదర్శి, కౌన్సిలర్‌గా పని చేసిన లావేటి అప్పలస్వామి వర్ధంతి సందర్భంగా ఏలూరు పట్టణంలో అమర జీవులను స్మరించుకోవటం జరుగుతుందని తెలిపారు. లావేటి అప్పలస్వామి పట్టణ కార్యదర్శిగా, సిపిఎం తరపున కౌన్సిలర్‌గా ప్రజలకు నిస్వార్థంగా అనేక సేవలందించాలని తెలిపారు. ఇదే ప్రాంతంలో పేద దళిత కుటుంబంలో పుట్టిన బాంతివర అప్పారావు తాను చదువుకున్నది తక్కువే అయినా, తన చుట్టూ ఉన్న ప్రజలకు విద్యను నేర్పించారన్నారు. అందుకే ఆయనను అప్పారావు మాస్టర్‌గా ఆనాడు ప్రజలందరూ పిలుచుకునేవారని గుర్తు చేశారు. పేదలకు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలపై పోరాడాలన్నారు. కొల్లిపర వెంకటేశ్వరరావు, చింతాడ కోటేశ్వరరావు, తాన రంగారావు తుది శ్వాస వరకు సిపిఎం సభ్యులుగా కొనసాగారన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి కిషోర్

ప్రతిఏటా కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేసి అమరులైన వారిని సిపిఎం గుర్తు చేసుకుంటూనే ఉంటుందన్నారు. సిపిఎం గాంధీ నగర్ శాఖ కార్యదర్శి, పట్టణ మాజీ కార్యదర్శి కంది విశ్వనాథం మాట్లాడుతూ లావేటి అప్పలస్వామి, బాంతివరపు అప్పారావు, కొల్లిపర వెంకటేశ్వరరావు జీవిత విశేషాలను, ఉద్యమాల్లో వారి పాత్రను సభకులకు వివరించారు. సభలో ముందుగా సిపిఎం పతాకాన్ని ఆ పార్టీ నగర కార్యదర్శి కిషోర్ ఆవిష్కరించారు. అమర జీవుల చిత్రపటాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు నగర కమిటీ సభ్యులు వి.సాయిబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు బి.జగన్నాధరావు, వివిఎన్.ప్రసాద్, చింతాడ వెంకటలక్ష్మి, మంచి జగదీష్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

ఉంగుటూరు : వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలు చట్టం రద్దు చేసి 2011 చట్ట ప్రకారం కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేలు కౌలు రైతులకే అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని కైకరం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా సమావేశం జిల్లా కమిటీ సభ్యులు దుడే కేశవ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ పంట రుణ ప్రణాళికలో కౌలు రైతులకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని, వడ్డీ లేని పంట రుణాలు అందించాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు మాట్లాడుతూ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కౌలు రైతుల సమస్యలపై విస్తృతంగా సంతకాలు సేకరించి జులై 15వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలవనున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో వినతి పత్రాలపై సంతకాలు సేకరించాలని సమావేశం నిర్ణయించిందని తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, ఇందుకూరి వెంకట్రాజు, అల్లు గోవింద్, కె.నాగేశ్వరరావు, కప్పల వెంకటరత్నం, వర్రి శ్రీరాములు, ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకమైన పాలన

ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అభివృద్ధిలో ప్రజల ఆలోచనలను భాగస్వామ్యం చేస్తేనే పారదర్శకమైన పాలనకు నాంది పడుతుందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరు కృష్ణ కాలువపై వంగాయగూడెం నుంచి మినీ బైపాస్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ పంపుల చెరువు వద్ద రూ.ఐదు కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని నగర మేయర్ షేక్ నూర్జహాన్, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణతో కలిసి ఎంఎల్‌ఎ బడేటి చంటి పరిశీలించారు. నిర్మాణానికి గల సాధ్యాసాధ్యాలను ఆర్‌అండ్‌బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మేలు చేసే అంశాలకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు ఎంఎల్‌ఎ సూచించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ భవనాలను ఆయన పరిశీలించారు. ఆయా ప్రాంతాలకు విచ్చేసిన ఎంఎల్‌ఎ చంటికి స్థానిక కార్పొరేటర్ల ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో భాగంగా కీర్తిశేషులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, టిడిపి నాయకులు ఎంఆర్‌డి బలరాం, చోడే వెంకటరత్నం, నగర పాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.



ఏలూరు సిటీ : మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బడేటి చంటి


ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు సిటీ : ప్రతి రోజూ ప్రతి గంట ప్రజల్లోనే ఉంటూ ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణ అన్నారు. నగరంలో గురువారం పలు ప్రాంతాల్లో బడేటి చంటి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా నాలుగు అన్న క్యాంటీన్లను త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏలూరు నుంచి పెదపాడు వెళ్లే మార్గంలో ఉన్న వంతెన పూర్తిగా శిథిలమైపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నూతనంగా వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తున్నామని తెలిపారు. ప్రతిరోజు ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నగరంలో పర్యటిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎతో పాటు మేయర్ నూర్జహాన్, నగర కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ

ప్రజాశక్తి - భీమడోలు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ చేసుకోవచ్చుని భీమడోలు పంచాయతీ విస్తరణాధికారి ఎ.సుందరి తెలిపారు. మండలంలో కొనసాగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో భాగంగా పంచాయతీ విస్తరణ అధికారి గురువారం సాయంత్రం ఆగడాలలంక, చెట్టున్నపాడు గ్రామపంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శులు మురళీకృష్ణ, డి.వెంకట్రావుతో వారి పరిధిలో కొనసాగుతున్న పారిశుధ్య పరిరక్షణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా ఆగడాల లంక జిల్లా పరిషత్ ఓరియంట్ ఉన్నత పాఠశాలను సందర్శించిన పంచాయతీ విస్తరణ అధికారి విద్యార్థులతో మమేకమయ్యారు.



మాట్లాడుతున్న పంచాయతీ విస్తరణాధికారి సుందరి

పీజీ లాసెట్‌లో సయ్యద్‌కు రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు

ప్రజాశక్తి - చింతలపూడి

ఎపి పీజీ లాసెట్ 2024 రెండేళ్ల కోర్సులో ప్రవేశం కోసం ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో చింతలపూడికి చెందిన సయ్యద్ షీమా తరణ్ణమ్‌కు రాష్ట్రంలో తొమ్మిదో ర్యాంకు సాధించారు. ఈ ప్రవేశ పరీక్షలో 87 మార్కులు సాధించి ఈ ర్యాంకు పొందారు. సయ్యద్ చింతలపూడిలోని సిటీ పబ్లిక్ హైస్కూల్‌లో పదో తరగతి, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్, భీమవరం డిఎన్‌ఆర్ లా కళాశాలలో ఐదేళ్ల బిఎఎల్‌ఎల్‌బి విద్యను అభ్యసించారు. ప్రస్తుతం చింతలపూడి బార్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్నారు.

మొరాయిస్తున్న సర్వర్లు

విద్యార్థుల పాట్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గ్రామ సచివాలయాల్లో తరచూ సర్వర్లు మొరాయిస్తున్నాయి. దీంతో సేవలకు ఆటంకం ఏర్పడుతుంది. కొత్తగా ప్రభుత్వం మారడంతో సర్వర్లలో మార్పులు చేశారు. ఈ పరిణామంతో సచివాలయాల సేవలకు ఆటంకం ఏర్పడుతుంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కళాశాలాలు, పాఠశాలలు తెరచుకోవడంతో విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు సచివాలయాల చుట్టూ కుల, ఆదాయ ధ్రువపత్రాలు దరఖాస్తు చేసుకునేందుకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి రెవెన్యూ సేవలు ఎన్నికల కారణంగా నిలిచిపోవడంతో ఇటు విద్యార్థులు, అటు రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల వారం రోజులుగా సచివాలయంలో సర్వర్లు పనిచేయలేదు. దీంతో డిజిటల్ అసిస్టెంట్లు విధులకు హాజరైన సర్వర్లు పని చేయకపోవడంతో చేసేది లేక ఖాళీగా ఉండిపో వలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. సర్వర్లు పనిచేయనికారణంగా వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు రోజుల తరబడి సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం పూట 11 గంటల లోపు సర్వర్ పని చేస్తుందని, ఆ తర్వాత సర్వర్ పని చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో సర్వర్‌లో చేర్పులు, మార్పులు, ప్రభుత్వ పథకాల పేర్లు మార్పులు చేయడం కారణంగా సర్వర్లు మొరాయిస్తున్నట్లు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా సర్వర్లు సక్రమంగా పనిచేసేలా సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

శ్రీవారి హుండీల ఆదాయం రూ.2.71 కోట్లు

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి వారి ఆలయ హుండీలు గురువారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామివారికి గడచిన 24 రోజులకు రూ.2,71,10,244 ఆదాయం వచ్చింది. అలాగే భక్తుల కానుకల రూపేణ 276 గ్రాముల బంగారం, ఆరు కేజీల 837 గ్రాముల వెండి, పాత రూ.500 నోట్లు 24, రూ.వెయ్యి నోటు ఐదు, రూ.రెండు వేల నోట్లు ఆరు, పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ ఇఒ వేంద్ర త్రినాధరావు తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది అధికారులు, అర్చకులు పాల్గొన్నట్లు తెలిపారు.

వికలాంగుల నిర్ధారణ వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

సమగ్ర శిక్షా శాఖ ఆధ్వర్యంలో 6 నుంచి 18 ఏళ్ల లోపు వికలాంగ బాలబాలికలకు వ్యాధి, వైకల్య శాతం నిర్ధారణ శిబిరం గురువారం నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. నియోజకవర్గంలో నలుమూలల నుంచి బాలబాలికలను తల్లిదండ్రులు తీసుకొచ్చారు. వారిలో 84 మందిని వివిధ కేటగిరిల కింద గుర్తించారు. వారికి అవసరమైన పరికరాల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు. సర్పంచి దిడ్ల అలకనంద, డివైఇఒ రవీంద్రభారతి, ఎంఇఒ శ్రీనివాసరావు, సమగ్ర శిక్షా జిల్లా కో-ఆర్డినేటర్, సిబ్బంది పాల్గొన్నారు.